క్లుప్తంగా

నర్సరీ పనుల పరిశీలన



వర్ని: హమ్నాపూర్‌లో నర్సరీ పనులను వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ శనివారం పరిశీలించారు. నర్సరీలో మొక్కలు చనిపోకుండా వన సంరక్షకుడు, పంచాయతీ కార్యదర్శి బాధ్యత తీసుకోవాలని, అవసరాన్ని బట్టి ఎరువులు, నీటిని అందించాలని సూచించారు. మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి అన్నీ మొలకెత్తే విధంగా చూడాలన్నారు. ఈ విషయంలో ఎక్కడైనా పొరపాటుల్ జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



నవీపేట(బోధన్): లింగాపూర్ గ్రామంలో మహమ్మద్ మోహినోద్దీన్‌కు రూ.22,000 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం సర్పంచ్ బత్తూర్ సాయిలు, గ్రామ అధ్యక్షుడు టేకు పోశెట్టి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కోరే రవి, జలంధర్, కరిపే గంగాధర్, గంగోని గంగాధర్, గొట్టుముక్కల సాయిలు, లింగాపూర్ గ్రామ బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వేల్పూర్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వేల్పూర్ ఎంపీపీ భీమ జమున అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం వివిధ గ్రామాలకు చెందిన 76 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మండల బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలు అభివృద్ధి చెందే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేందర్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నల్ల రమేశ్, వైస్ ఎంపీపీ బోజపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రమాబాయికి నివాళులు



వేల్పూర్: రామన్నపేట్‌లో శనివారం భారతరత్న బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి 88వ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆమె సేవలు, త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు బాబూరావు, మహిళలు పాల్గొన్నారు.

తొర్తిలో..



మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కుండ సాయన్న ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ సతీమణి రమాబాయ్ అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులు అర్పించారు. ఉపసర్పంచ్ తాహెర్, నాయకులు ధోన్పాల ముత్తెన్న, జంబుక రాజేష్, జంబుక లత, బత్తుల భారతి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీజేపీ చేయూత



కమ్మర్‌పల్లి: చౌట్‌పల్లిలో వారం రోజుల క్రితం వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన గడ్డం రేవంత్ కుటుంబానికి బీజేపీ ఆర్థిక చేయూత అందించింది. ఆ పార్టీ బాల్కొండ నియోజకవర్గ నేత డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి రూ.10 వేలు అందించగా, పార్టీ మండలాధ్యక్షుడు కట్ట సంజీవ్ కుమార్, నాయకులు శనివారం రేవంత్ ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు అందజేశారు. భూమారెడ్డి, ఎలాల వెంకట్‌రెడ్డి, చిట్యాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ఆర్టీసీ బస్టాండ్

- ప్రభుత్వ టాయిలెట్స్ ఉన్నా ఉపయోగించుకోని ప్రయాణికులు
- ఇబ్బందులు పడుతున్న మహిళలు



ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో వేసిన చెత్తాచెదారం

ఆర్మూర్‌టౌన్: ప్రతిరోజు వేల మంది ప్రయణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌కు వస్తుంటారు. అలాంటి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంతో ప్రయాణికులు కాసేపు కూడా ఉండలేకపోతున్నారు. బస్టాండ్ పరిసర దుకాణదారులు చెత్తను ఖాళీస్థలంలో వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. బస్టాండ్ ఆవరణలో ఖాళీ స్థలం ఉండటం.. చెత్తాచెదారం వేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తుంది. జర్నలిస్టు కాలనీ నుంచి బస్టాండ్ వచ్చేటప్పుడు దుర్వాసన వస్తుండటంతో ముక్కుకు వెలేసుకుని నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే పందులు, ఆవులు, కుక్కలు అక్కడ తమ ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ టాయిలెట్లు ఉన్నా కొందరు బయటనే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయివేట్ వాహనాలు లోనికి రావడంతో ఆర్టీసీకి నష్టం వాటిల్లుతుంది. రాత్రి సమయంలో మందుబాబులకు ఆర్టీసీ బస్టాండ్ అడ్డాగా మారింది. సంబంధిత ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్టాండ్ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

ప్రైవేట్ వాహనాలను అరికట్టాలి



ప్రైవేట్ వాహనాలను బస్టాండ్ లోపలికి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్నారు. లోనికి రాకుండా అరికడితే అటు ఆర్టీసికి లాభం, ఇటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. త్వరగా చర్యలు తీసుకోవాలి. – సుభాష్, ఆర్మూర్

పందులు స్వైర విహారం చేస్తున్నాయి



బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం ఉండటంతో పందులు అక్కడకు చేరి విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారింది. చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. – శ్రీధర్, ఆర్మూర్

ఏపీఎంను సరెండర్ చేయాలి

- రెంజల్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం
- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడం లేదని అధికారుల నిలదీత



రెంజల్ మండల సభలో ఏపీఎం చిన్నయ్యను నిలదీస్తున్న రెంజల్ వింద్రో చైర్మన్

రెంజల్(బోధన్): ఐకేపీ ఏపీఎం చిన్నయ్యను సరెండర్ చేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎంపీపీ లోలపు రజని అధ్యక్షతన శనివారం రెంజల్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఏపీఎంగా ఉండి ఏ గ్రామ సంఘాల సమావేశాలకు హాజరవుతున్నారని సభ్యులు ప్రశ్నించారు. బోర్గాం, నీలా గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను వారం రోజుల ముందుగానే ఎందుకు ఎత్తివేశారని నిలదీశారు. దొడ్డు రకాలను రైస్‌మిల్లర్లు కొనుగోలు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, 5 కేజీల వరకు తరుగు తీస్తున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. వీవోలో నిధులున్నా సభ్యులకు ఎందుకు ఇవ్వడంలేదని నీలా ఎంపీటీసీ స్వప్న ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ అవసరాలకు రుణాలు ఇవ్వకుంటే ఎందుకని, ప్రతీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలతో పాటు వరి కోత యంత్రం ద్వారా వస్తున్న ఆదాయం లెక్కలు చూపించాలని పట్టుబట్టారు. ఏపీఎంతో పాటు సీసీలను వెంటనే మండలం నుంచి బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని 24 గంటలూ ప్రభుత్వ కార్యాలయాల ముందు నుంచే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని సర్పంచ్‌లు రెవెన్యూ, పోలీసు శాఖలపై మండిపడ్డారు. కందకుర్తిలో రాత్రిళ్లు టిప్పర్లు, ట్రాక్టర్ల చప్పుళ్లతో స్థానికులకు నిద్రపట్టడంలేదని సర్పంచ్ పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకవచ్చారు. ఎస్‌ఎస్‌ఎఫ్ భూముల రిజిస్ట్రేషన్‌ల నిలిపివేతతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచ్‌లు తహసీల్దార్‌కు వివరించారు. అలాగే పలు సమస్యలను సమావేశంలో సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ విజయ, ఎంపీటీసీలు స్వప్న, గంగలత, రుక్మిణీ, లక్ష్మీ, అంతయ్య, అసద్‌బేగ్, యోగేశ్, సర్పంచ్‌లు మర్ల రమేశ్‌కుమార్, మిర్జా ఖలీంబేగ్, పాముల సాయిలు, గణేశ్ నాయక్, శ్రీదేవి, రొడ్డ విజయ, కాశం నిరంజన, గౌరిజీ లలిత, తహసీల్దార్ రాంచందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న జిల్లా నేత రాజశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ నేత నక్క రాజేశ్వర్

మాక్లూర్ : రానున్న ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ప్రజల్లోనికి వెళ్లాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు కాలగడ్డ వినోద్ అధ్యక్షతన జరిగిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరో 6 నెలల వ్యవధిలో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి బీజేపీ కార్యకర్త ఇప్పటి నుంచే ప్రజల్లోనికి వెళ్లాలన్నారు. ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలన్నారు. నిత్యం జనాలతో ఉండేటట్లు తగు ప్రణాళికలు రూపొందించుకొని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నేతలు గంగోనే సంతోష్, చిన్నాపూర్ వినోద్, ముప్ప గంగారెడ్డి, రాజేశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్: రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో బీజేపీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ములిగే మహిపాల్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కనికరం మధు, తదితరులు పాల్గొన్నారు.

రెండు చోట్లా అధికారం బీజేపీదే



బాల్కొండ: కేంద్రంలో మూడవ సారి, తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర నేత లోక భూపతి రెడ్డి జోస్యం చెప్పారు. శనివారం ముప్కాల్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘ భవనంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, నేతలు జైడి రవి, దినేష్, భూమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం వెంటనే చెల్లించాలి



పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన విధంగా ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గ కన్వీనర్ పాలెపు రాజు, మండల అధ్యక్షుడు రోహిత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆలూర్ మండలం మచ్చర్లలో శనివారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. అలాగే రైతులకు ఇస్తామన్న రూ.లక్ష రుణమాఫీ ఇప్పటి వరకు చేయలేదని, బిందు సేద్యం చేస్తున్న రైతులకు 90 శాతం రాయితీని వెంటనే విడుదల చేయాలన్నారు. బీజేపీ ఆర్మూర్ మండల ప్రధాన కార్యదర్శి రవి గౌడ్, ఉపాధ్యక్షులు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం



క్రీడాకారులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

భీమ్‌గల్: ఇటీవల జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడల్లో కబడ్డీ, రన్నింగ్ విభాగాల్లో భీమ్‌గల్ క్రీడాకారులు ద్వితీయ స్థానం సాధించడంతో పాటు కొందరు స్టేట్ లెవెల్‌కి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆర్మూర్ మహేశ్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్టేట్ లెవెల్‌లో భీమ్‌గల్ పేరు ప్రతిష్టలు నిలిపేందుకు కృషి చేస్తున్న క్రీడా కారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి సహకారంతో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మండల స్థాయి నాయకులు కృషి చేస్తారని తెలిపారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో గంగా మోహన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు వేసుకున్న మొరం రోడ్డు పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్, వింద్రో చైర్మన్

రుద్రూర్: కాంట్రాక్టర్ ప్రమేయం లేకుండా చందూర్ శివారులో రైతులు స్వయంగా నిర్మించుకుంటున్న పంట పొలాల రోడ్డును శనివారం చందూర్ వింద్రో చైర్మన్ ప్యారం అశోక్, సర్పంచ్ కర్లం సాయరెడ్డి పరిశీలించారు. పొలం వరకు ఎరువులు, విత్తనాల తరలింపు, ధాన్యం సేకరణకు సరైన రోడ్డు సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నిధులు మంజూరు చేశారు. ధాన్యం లోడ్ లారీలు వెళ్లేటట్లు పటిష్టంగా రోడ్డు నిర్మించుకోవాలని స్పీకర్ సూచించడంతో 24 ఫీట్ల మేర మొరం రోడ్డును రైతులు వేస్తున్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర



కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లో శనివారం పెద్దమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. భక్తులు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పెద్దమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఆర్మూర్‌టౌన్: పుర ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం కొనసాగుతోంది. అందులో భాగంగా 17వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. నాలాల్లో పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగించాలన్నారు. కౌన్సిలర్ ఫయాజ్, సానిటరీ ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



ఏర్గట్లలో మాట్లాడుతున్న బీజేపీ నేత స్రవంతి రెడ్డి

మోర్తాడ్: కేంద్రం తొమ్మిదేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని నిజామాబాద్ కార్పొరేషన్ బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి సూచించారు. శనివారం ఏర్గట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి, సర్పంచ్ సోమ పెద్ద రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో...

మోర్తాడ్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంను నిర్వహించగా పార్టీ జిల్లా కార్యదర్శి సురేందర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్, సుంకెట్ ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్, నాయకులు తీగెల రమేష్‌రెడ్డి, తక్కూరి సాగర్, భోగ దేవేందర్, కోరం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విత్తనమే బీఆర్‌ఎస్ పార్టీ



వర్నిలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం పక్కన మండవ, తుమ్మల, బీబీపాటిల్, గాంధీ, విఠల్

– స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

వర్ని: తెలుగుదేశం పార్టీ విత్తనమే బీఆర్‌ఎస్ పార్టీ అని, పార్టీ పేరు మారినా విత్తనం టీడీపీదేనని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వర్ని మండల కేంద్రంలో మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన తనయుడు రామకృష్ణతో కలిసి స్పీకర్ ఆవిష్కరించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో 50 శాతం మంది టీడీపీ వారే ఉన్నారన్నారు. దేశం అబ్బురపడే విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత నాడు ఎన్టీఆర్‌కు దక్కిందని, ఇప్పుడు ఆ ఘనత కేసీఆర్ దక్కిందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ అరికపూడి గాంధీ, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మాజీ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నేత పోచారం సురేందర్ రెడ్డి, వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ, జెడ్పీటీసీ హరిదాసు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ముప్కాల్ మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న వీవోఏలు



ఆర్మూర్ పట్టణంలో..

ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం ఇవ్వాలనే డిమాండ్‌తో జిల్లా వ్యాప్తంగా ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



వర్నిలో..



రుద్రూర్‌లో..

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 – ఫాస్ట్ ఎక్స్ (తెలుగు) 10.30, 4.10, 7.10
గ్రే: ది స్పై హు లవ్డ్ మీ (తెలుగు) 1.30
2018 (తెలుగు) – 10.10 (రాత్రి)

స్క్రీన్-2 – బిచ్చగాడు2 – 12.15, 3.30, 6.45, 10.00

స్క్రీన్-3 – మేమ్ ఫేమస్ – 10.30, 4.30, 10.30
మళ్లీ పెళ్లి – 1.40, 7.40

స్క్రీన్-4 – మెన్‌టూ (తెలుగు) – 12.20, 9.15
2018 (తెలుగు) – 3.05
ది కేరళ స్టోరీ (తెలుగు) – 6.15

రైతు వేదికలు మెరవాలి

- దశాబ్ది ఉత్సవాలపై వ్యవసాయాధికారులకు ఆదేశాలు



డొంకేశ్వర్(ఆర్మూర్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో వ్యవసాయ శాఖకు కీలక బాధ్యతలు అప్పగించారు. రైతు వేదికలను రంగులు, లైటింగ్‌తో అందంగా ముస్తాబు చేయాలని అధికారులకు ఆదేశాలందాయి. జూన్ 3న రైతు దినోత్సవం నిర్వహించి క్లస్టర్ వారీగా వెయ్యి మందికి నాన్‌వెజ్ భోజనాలు అందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలో మొత్తం 106 రైతు వేదికలున్నాయి. దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం రైతు వేదికలు కూడా మెరిసేలా చర్యలు చేపడుతోంది. ఇందుకు మూడు రోజుల పాటు లైటింగ్ ఉంచి సంబరాలు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారులకు సూచించారు. మండలం, క్లస్టర్ పరిధిలో వ్యవసాయ శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వాములు కానున్నారు. అలాగే ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించనున్నారు. 3న రైతు దినోత్సవం చేపట్టి రైతులతో సమావేశాలు నిర్వహించి ఒక్కో రైతు వేదిక దగ్గర వెయ్యి మందికి తగ్గకుండా భోజన సౌకర్యం కల్పించనున్నారు. అవసరమైన నిధుల ఖర్చుపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఖర్చు బాధ్యతను అధికారులకు అప్పగిస్తారా? స్థానిక ప్రజాప్రతినిధులే చూసుకుంటారనే దానిపై సోమవారానికల్లా స్పష్టత రానుంది.

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మధు శనివారం తెలిపారు. నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో మగ్గిడికి చెందిన నవీన, స్పందన, మానస, కీర్తితో పాటు అరవింద్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. దీంతో క్రీడాకారులను సర్పంచ్ సుద్దపల్లి సుమలత, సర్పంచ్ భర్త సుద్దపల్లి నర్సయ్య, వీడీసీ సభ్యులు అభినందించారు.